క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు బలిఘట్టం విద్యార్థిని


సర్వసిద్ధి హిమబిందు

నర్సీపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భీమిలిలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి బేస్ బాల్ అండర్ 14 బాలికల విభాగం పోటీల్లో బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సర్వసిద్ధి హిమబిందు సత్తా చాటింది. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. పాఠశాలకు పేరు తీసుకువచ్చిన హిమబిందు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వరరావును హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా బంద్

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నర్సీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం. అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోలుగుంట, కొమరవోలు, కొంతలం, కె.నాయుడుపాలెం, చెట్టుపల్లి, గురందొరపాలెం, నగరం, నిండుగొండ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, తమ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

దేవరాపల్లి: మండలంలోని పెదనందిపల్లి, మారేపల్లి, ములకలాపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానిక విద్యుత్ శాఖ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. ఈ మూడు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమకు సహకరించాలని కోరారు.

సక్రమంగా మెనూ అమలు చేయాలి


ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న జీసీడీవో జెమీమా

మాకవరపాలెం: విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి(జీసీడీవో) జెమీమా అన్నారు. కస్తూర్బా పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత, ఆర్వో ప్లాంట్‌తోపాటు రికార్డులు, పరిసరాలను తనిఖీ చేశారు. విద్యాశక్తి పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పది, ఇంటర్ విద్యార్థులు ప్రణాళికతో లక్ష్యాలను చేరుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో త్రివేణి పాల్గొన్నారు.

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నాతవరం: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలో చినగొలుగొండపేట పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధిగా సమయ పాలన పాటించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

ప్రతి పశువుకూ టీకా తప్పనిసరి


రైతులకు సూచనలు చేస్తున్న పశువైద్యాధికారి బాలతేజ

రావికమతం: మూడు నెలలు దాటిన ప్రతి పశువుకూ గాలికుంటు వ్యాధి నివారణకు టీకా తప్పని సరిగా వేయించాలని కొత్తకోట పశువైద్యాధికారి బాలతేజ తెలిపారు.శుక్రవారం పి.పొన్నవోలు పంచాయతీ ఆర్.కొత్తూరు,జి.చీడిపల్లి,చిన్న కుముందానపేట,పి.పి.గదపపాలెం గ్రామాల్లో 200 పైగా పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ దూడల నుంచి చూడి పశువుల వరకు అన్నింటికీ టీకాలు వేయించాలన్నారు.ఈ కార్యక్రమం అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధశాఖ సహాయకులు రావి ప్రసాద్,రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం


నాగజ్యోతిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య మహాసభ సభ్యులు

రోలుగుంట: అమరజీవి పొట్టి శ్రీరాములు భవనం 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ సభ్యులు రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు, రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత పి.వి.ఎం. నాగజ్యోతితో పాటు పలువురిని ఘనంగా సన్మానించారు. పిరాట్ల నర్సింహమూర్తి,వెంకటరమణమ్మ మినీ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ నాగజ్యోతి సేవలను కొనియాడారు.

భక్తులపాలిట కల్పవల్లి.. దుర్గమ్మ తల్లి

- సీతయ్యపేటలో 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు
- భారీ ఏకశిల విగ్రహం దర్శనం కోసం లక్షలాది మంది భక్తుల రాక
- 29న తిరువీధి, తెప్పోత్సవం


సీతయ్యపేటలో దుర్గామల్లేశ్వర ఉత్సవ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


విద్యుత్ దీపాలంకరణలో ఆలయం


టన్ను బరువు గల ఏకశిల దుర్గామల్లేశ్వర విగ్రహం

బుచ్చెయ్యపేట: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పాలిట కొంగుబంగారంగా సీతంపేటలో వెలసిన దుర్గమ్మ పూజలందుకుంటోంది. మండలంలోని సీతయ్యపేటలో గల దుర్గామల్లేశ్వర్ల ఆలయం ఎంతో విశిష్టమైంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ టన్ను బరువున్న ఏకశిలా విగ్రహం రూపంలో అమ్మవారు దర్శనమిస్తున్నారు.ఈ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది కూడా నవరాత్రి ఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగుల, అనకాపల్లి, చోడవరం, కశింకోట, నర్సీపట్నం, విశాఖ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భవానీ భక్తులు అమ్మవారి ఆలయంలో మాలలు ధరించి దీక్షలు ఆచరిస్తారు. ఆలయంలో నవరాత్రులూ ప్రత్యేక పూజలు చేసి దీక్ష ముగిసిన తర్వాత తిరిగి ఇక్కడ మాలలు విసర్జిస్తారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, మంచినీటితో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి భోజన సదుపాయం , తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.

అమ్మవారికి నిత్య పూజలు

ఈ నెల 22న ప్రారంభమయ్యే శరన్నవరాత్రి మహోత్సవాల్లో రోజుకొక అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 29న అగ్నిగుండం తొక్కుట, మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రికి భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత, నేల డ్యాన్స్, తప్పెటగుళ్లు, కోలాటాలు, చిటికెన భజనల మధ్య అమ్మవారి తిరువీధి ఉత్సవం అనంతరం కోనేరులో తెప్పోత్సవం, 30న సహస్ర కుంకుమార్చన అక్టోబర్ 2న ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

‘చలో మెడికల్ కాలేజీ’ నిరసనకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు


దేవరాపల్లి మండలం నుంచి నిరసనకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు

దేవరాపల్లి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన ‘చలో మెడికల్ కాలేజీ’ నిరసన కార్యక్రమానికి దేవరాపల్లి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. దేవరాపల్లి మండలం నుంచి శుక్రవారం ఉదయం బయలుదేరి నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలో మాకవరపాలెం మండలంలో గల ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో వారంతా పాల్గొన్నారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వారిలో మండల యువజన అధ్యక్షుడు, మామిడిపల్లి సర్పంచ్ కర్రి సూరినాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యవర్గ సభ్యుడు, వెంకటరాజుపురం సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, కోఆపరేటివ్ సొసైటీ మాజీ వైస్ ప్రెసిడెంట్ జూరెడ్డి గోవింద, సీనియర్ నాయకులు చల్లా మహేష్, పోతల సత్యనారాయణ, లెక్కల అక్కునాయుడు, వరదపురెడ్డి ధనేశ్వరరావు తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు ఐక్యంగా పోరాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల కమిటీ అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా ఐక్యంగా పోరాడాలని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల కమిటీ పిలుపునిచ్చింది. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద శుక్రవారం మండల కమిటీ అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల కొన్ని ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ముఖ్యంగా మాలలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. డీఎస్సీ–2025లో ఎస్సీ యువకులు వందల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని రద్దు చేయాల్సిందేనని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు. నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సాన్ని ఘనంగా నిర్వహించాలని మండల కమిటీ తీర్మానించింది. ఈ సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు, కంచిమాల అప్పారావు, మచ్చా వీర్రాజు, రొప్పల రాజు, బల్లంకి మధుసూధనరావు, తెరపల్లి శ్రీరామ్, పాటిల దేముళ్లు తదితర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవో దృష్టికి మండల సమస్యలు


ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: స్థానిక ఎంపీడీవో శివ ప్రసాద్ నారాయణను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల కొత్తగా విధుల్లో చేరిన ఎంపీడీవోను శుక్రవారం వారు కలిసి మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవోను కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు,జెడ్పీటీసీ దొండా రాంబాబు,డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు,వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి,గొంపా చినబాబు,పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,నాయకులు ఎల్లపు విజయ్‌కుమార్,గోపిశెట్టి శ్రీను,ముచ్చకర్ల అప్పారావు,సుంకరి గాంధీ,కంటే వెంకట్,జోగా కొండబాబు,కోరుకొండ రమణ,శ్రీను తదితరులున్నారు.

ఎంపీడీవోకు వైఎస్సార్ సీపీ నేతల సత్కారం


ఎంపీడీవో మహేష్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ పైల రాజు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం: స్థానిక ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఎంపీడీవోను కలిసిన వారిలో ఎంపీపీ పైల రాజు, ప్రొటోకాల్ జెడ్పీటీసీ తలారి ఆదిమూర్తి, బీసీసీబీ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి శీలం శంకరరావు,ఎంపీటీసీ సభ్యులు పూడి దేవా, కుంచా లక్ష్మి శంకరరావు,కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు తదితరులున్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌ను సద్వినియోగం చేసుకోవాలి


పింద్రంగిలో ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి శైలజ


పైడంపేటలో మహిళల ఆరోగ్యంపై ప్రతిజ్ఞను చేయిస్తున్న వైద్యాధికారి మాదంనాయుడు


చింతలపూడిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి పూజ్యమేఘన


జేడీపేట గ్రామంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. శుక్రవారం మండలంలో జేడీపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందన్నారు. అనంతరం మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి వైద్యాధికారి శ్రీను తదితరలు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

కె.కోటపాడు : కుటుంబంలో తల్లి ఆరోగ్యంగా ఉంటే పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పింద్రంగి, పైడంపేట గ్రామాల్లో మహిళలకు శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలను లంకవానిపాలెం, చౌడువాడ పీహెచ్‌సీల వైద్యాధికారులు శైలజ, మాదంనాయుడు నిర్వహించారు. పింద్రంగిలో 128 మంది, పైడంపేటలో 87 మంది మహిళలకు వైద్య పరీక్షలను జరిపి, ఉచితంగా మందులను అందజేశారు. పైడంపేటలో వైద్య సిబ్బందిచే మహిళల ఆరోగ్యంపై వైద్యాధికారి మాదంనాయుడు, ఎంపీహెచ్‌ఈవో జె.సన్యాసిరావు ప్రతిజ్ఞను చేయించారు. పింద్రంగిలో పీహెచ్‌ఎస్.ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు

మాకవరపాలెం: మండలంలోని రెండు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి 235 మందికి వైద్య సేవలు అందించారు. స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పైడిపాల, తామరంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ రకాల క్యాన్సర్‌లపై పరీక్షలు చేశారు. సాధారణ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసరావు, చరిష్మ, సీహెచ్‌వో రమేష్, సర్పంచ్‌లు రుత్తల జ్యోతి, చెల్లారత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో చింతలపూడిలో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చింతలపూడిలో నిర్వహించిన వైద్య శిబిరంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ. పూజ్య మేఘన, ఆయుర్వేద వైద్యాధికారి జి. గ్రీష్మ 164 మందికి వైద్య సేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తామరబ్బ సర్పంచ్ టోకురి రామకృష్ణ పాల్గొని సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌వో ఎం.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

నర్సీపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి ఎం.వినోద్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల తీరును పరిశీ లించారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివి ఐఐటీ, నీట్, ఇంజినీరింగ్ ఇతర కాంపిటీటివ్ పరీక్షల్లో ర్యాంకులు సాధించాలన్నారు. విద్యాబోధన, ఇతర విషయాలపై ప్రిన్సిపాల్ పద్మావతి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.


కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి వినోద్‌బాబు

నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు


కె.కోటపాడులో సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖరులు


నర్సీపట్నంలో నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు


మాడుగులలో నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖరులు



చోడవరంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

నర్సీపట్నం: సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాలను సవరించాలని డిమాండ్ చేస్తూ డాక్యుమెంట్ రైటర్లు రెండు రోజుల పాటు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి నిరసన తెలియజేశారు. రైటర్లు పెన్ డౌన్ చేపట్టడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.కార్యాలయం బోసిపోయింది. సుమారు రూ.కోటి ఆదాయానికి గండిపడింది. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ కార్డు ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సాంకేతిలోపాల కారణంగా డాక్యుమెంట్ రైటర్లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గంటల తరబడి ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఓటీపీ విధానం వల్ల కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎడిటింగ్ ఆప్షన్ తొలగించటం వల్ల ఏ చిన్న పొరపాటు దొర్లినా మొత్తం డాక్యుమెంట్ మార్చుకోవాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే సాంకేతిక పరమైన లోపాలను సవరించాలన్నారు.

చోడవరం: స్థానిక దస్తావేజు లేఖర్లు శుక్రవారం పెన్‌డౌన్ చేశారు. దీంతో చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు కొంతమేర ఇబ్బంది కలిగింది. ఈ నూతన విధానంలో ఓటీపీల వల్ల డాక్యుమెంట్ సబ్మిట్‌చేసిన తర్వాత ఎడిట్ ఆప్షన్ లేకపోవడం చాలా ఇబ్బందులకు గురవుతున్నామని దస్తావేజులేఖరుల సంఘ అధ్యక్షుడు వద్దాడి రమేష్ తెలిపారు. ప్రైమ్ 2.0ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సంఘ గౌరవ అధ్యక్షుడు సీతారామయ్య, వైస్ ప్రెసిడెంట్ బొబ్బిలి చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనువాసు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 2.0 ప్రైమ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కె.కోటపాడులోని దస్తావేజు లేఖరులు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు బొబ్బిలి సన్యాసిరావు, రుత్తల దాలినాయుడు, బొడ్డు దొరస్వామినాయుడు, కోట అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రైమ్ విధానం పలు సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. పాత విధానాన్నే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు దుంగల రమేష్, రెడ్డి నాగేశ్వరరావు, సీముసురు దేముడుబాబు, కర్రి దేముడునాయుడు, తోండవరపు రాజు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజు లేఖరులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. అశోక్, కాశీ సూర్యప్రకాశ్‌రావు, నరసింగరావు, గిరి,దేముడు, రఘు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సన్నిబాబు, కొండబాబు

కె.కోటపాడు : సూదివలస విశాఖడెయిరీ సభ్య రైతులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. దసరా సందర్భంగా పాల సంఘంలో గల 120 మందికి వీటిని అందజేసినట్లు సంఘ అధ్యక్షుడు వర్రి సన్నిబాబు, ఉపాధ్యక్షుడు వర్రి కొండబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెరెక్టర్లు చల్లా నాయుడు, కోట్యాడ ఈశ్వరరావు, వేతన కార్యదర్శి ఎల్లపు నర్సింగరావు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి


తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల, మేకల పెంపకందారులు

మాడుగుల రూరల్ : ఎం.కృష్ణాపురంలో గొర్రెలు, మేకల పెంపకందారుల కుటుంబానికి చెందిన కోళ్ళ వరహాలనాయుడుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం సభ్యులు శుక్రవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీవాల పెంపకందారుల రక్షణకు చట్టం చేయాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయాలని కోరారు.

దసరా సెలవులు ఇవ్వకుంటే ఆందోళన తప్పదు


మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నర్సీపట్నం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు దసరా సెలవులు ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ ప్రెసిడెంట్, సెక్రటరీ ప్రవీణ్ జనార్దన్, సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యా సంస్థల అసోసియేషన్ సెక్రటరీ మోహన్‌కు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతిపత్రం శుక్రవారం ఇచ్చారు. సెలవులు ఇవ్వకుండా క్లాస్‌లు నిర్వహిస్తే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న కె.కోటపాడు ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి


పోషణ మాసోత్సవాల సందర్భంగా వీరవల్లిలో ఏర్పాటు చేసిన స్టాల్

దేవరాపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కె.కోటపాడు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో పి.లలితకుమారి అన్నారు. మండలంలోని చింతలపూడి సచివాలయంలో పోషణ మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక పోషణ విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ. పూజ్య మేఘన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తామరబ్బ సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : పోషణ మాసోత్సవంలో భాగంగా మండలంలో వీరవల్లి అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, శశికళ, శ్యామల, లక్ష్మి తదితర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషకాహార స్టాళ్లను ఏర్పాటు చేశారు.

కె.జె.పురంలో ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సు

ఇక్కట్లకు గురైన ప్రయాణికులు


మధురవాడ డిపోకు చెందిన విశాఖ- జోలాపుట్ బస్సు

మాడుగుల రూరల్: ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కె.జె.పురంలో నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణికులు, కళాశాల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మధురవాడ డిపోకు చెందిన విశాఖపట్నం–జోలాపుట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు శుక్రవారం మధ్యాహ్నం విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బయలుదేరి సాయంత్రం చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరింది.

కాంప్లెక్స్‌లో కె.జె.పురం, ఘాట్‌రోడ్డు, మాడుగుల, వీరనారాయణం తదితర గ్రామాలకు చెందిన కళాశాల విద్యార్థినీవిద్యార్థులు, కె.జె.పురం గ్రామానికి చెందిన మహిళలు ఈ బస్సు ఎక్కారు. అయితే కండక్టర్ కె.జె.పురంలో కాకుండా ఘాట్ రోడ్డు జంక్షన్‌లో బస్సును నిలుపుదల చేశారు. దీంతో సుమారు 15 మంది కళాశాల విద్యార్థులు ఉసూరుమంటూ రాత్రి 7 గంటల తర్వాత ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి గ్రామానికి చేరుకున్నారు. బస్సును గ్రామంలో ఆపాలని ఎంత ప్రాధేయపడినా కండక్టర్, డ్రైవర్ వినిపించుకోలేదని, ఆరు కిలోమీటర్ల తరువాత ఆపడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని కళాశాల విద్యార్థినులు కాళ్ల అనుష, ఇంద్రజ తదితరులు వాపోయారు. ఈ బస్సు డ్రైవర్, కండక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్, మధురవాడ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు, విద్యార్థినులు తెలిపారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో అన్ని ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్ సర్వే


డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్న ఎస్‌ఐ రఘువర్మ

రావికమతం: మండల కేంద్రం రావికమతంలో ట్రాఫిక్ నియంత్రణకు శుక్రవారం స్థానిక ఎస్‌ఐ రఘువర్మ, సిబ్బందితో కలిసి డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.